సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 23 । అక్టోబర్ । 2023



సోమశిలలో 30.443 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో ఆదివారానికి 30.443 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి 156 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.62,690
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.5,660
3శాతం జీఎస్టీతో	రూ.5,830
నవర (8గ్రా)	రూ.46,640

గరిష్టం/కనిష్టం
36.2 /26.2

వాతావరణం

ఆదివారం గాలిలో తేమ 58 శాతం ఉంది. సోమవారం ఎండతీవ్రత, ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

చెడుపై మంచి సాధించిన విజయం



నెల్లూరు(దర్గామిట్ట): చెడుపై మంచి సాధించిన విజయమే విజయదశమి అని, జగన్మాత ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో తులతూగాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆకాంక్షించారు. సోమవారం విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంత్రి ఆదివారం ప్రజలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అమ్మవారి ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు.

మహిళా శక్తికి ప్రతీక



నెల్లూరు(దర్గామిట్ట): శక్తి స్వరూపిణి అయిన అమ్మవారు రాక్షస సంహారం చేసి మహిళా శక్తికి ప్రతీకగా నిలిచారని, ఆ విజయానికి గుర్తుగా విజయదశమి పండగను జరుపుకుంటున్నామని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. విజయదశమిని పురస్కరించుకుని ఆదివారం ఆయన జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండగను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని, దుర్గామాత ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

సరికొత్త విజయాలను అందించాలి



నెల్లూరు(దర్గామిట్ట): విజయదశమి అంటే విజయానికి ప్రతీక అని, ఈ దసరా పండగ జిల్లా ప్రజలందరికీ సరికొత్త విజయాలు అందించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆకాంక్షించారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని కలెక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అన్నివర్గాల ప్రజలకు చేరవేస్తూ అన్ని రంగాల్లో జిల్లాను ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

బంగారు చీరలో ముత్యాలమ్మ అమ్మవారు



చిల్లకూరు: మండలంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ అమ్మవారు ఆదివారం బంగారు చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు చేశారు. అనంతరం బంగారు చీరను అలంకరించారు. 200 మంది మహిళలతో లక్ష కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం దుర్గాదేవిగా అలంకరించి రథంపై కొలువుదీర్చి అమ్మవారికి ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తగా ఆలయ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ వేమారెడ్డి మురళీమోహన్‌రెడ్డి వ్యవహరించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ పర్యవేక్షించారు.

నేటి స్పందన రద్దు

నెల్లూరు(క్రైమ్): దసరా పండగను పురస్కరించుకుని సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా పోలీసు కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఫిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.

భారీగా బొగ్గు దిగుమతి

ముత్తుకూరు: మండలంలోని అదానీ కృష్ణపట్నం పోర్టు ద్వారా భారీ స్థాయిలో బొగ్గు దిగుమతి జరుగుతున్నట్లు పోర్టు ఉన్నతోద్యోగి ఒకరు ఆదివారం తెలిపారు. ఇందులో భాగంగా లైలా నాంటోంగ్ అనే నౌక ద్వారా 1.27 లక్షల టన్నుల బొగ్గు దిగుమతి చేస్తున్నారు. అలాగే సీఏసీ పవోలా అనే నౌక నుంచి 1.65 లక్షల టన్నుల బొగ్గు దిగుమతి జరుగుతోంది. ఇవేకాకుండా మరో ఐదు నౌకల ద్వారా బొగ్గు దిగుమతి చేస్తున్నారు.

జగన్మాతా నమోస్తుతే



నెల్లూరులోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో కాళికాదేవి అలంకారం

జిల్లాలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రుల సందర్భంగా అమ్మవారు ప్రతి రోజూ ఒక్కో అలంకారంలో భక్తులను కటాక్షిస్తున్నారు. ఆదివారం దుర్గాష్టమి సందర్భంగా ఆయా ఆలయాల నిర్వాహకులు అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేపట్టి భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



రాజరాజేశ్వరి ఆలయంలో దుర్గాదేవి అలంకరణ



అయ్యప్పస్వామి ఆలయంలోని గురువాయూర్ మహావిష్ణు ఆలయంలో శ్రీవైష్ణవి అలంకారం

■ నేటి అలంకారం



■ రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారు

జామాయిల్ ధర పైపైకి

జామాయిల్ కర్రకు ఒక్కసారిగా డిమాండ్ పెరగడం, పేపర్ తయారీ కంపెనీల పోటీతో వీటి ధరలకు రెక్కలొచ్చాయి. నిన్న, మొన్నటి వరకు రూ.2 వేల లోపు పలికిన టన్ను కర్ర ధర ప్రస్తుతం రూ.5 వేల వరకు పలుకుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా కంపెనీల డిమాండ్‌కు సరిపడా ప్రస్తుతం జిల్లాలో కర్ర ఉత్పత్తి లేకపోవడంతో ఈ పోటీ మరింత పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

పేపర్ తయారీ కంపెనీల పోటీతో భారీగా పెరిగిన రేట్లు

- ఎఫ్‌డీసీ వేలంలో టన్ను రూ.6 వేల వరకు పలికిన ధర
- రైతుల వద్ద దాదాపు రూ.5 వేలకు కొనుగోలు చేస్తున్న కంపెనీలు
- భవిష్యత్‌లో రేటు ఇంకా పెరిగే అవకాశం
- విస్తృతంగా సాగు చేస్తున్న రైతులు



కందుకూరు సమీపంలో సాగులో ఉన్న జామాయిల్ తోట

మార్కెట్ ఆశాజనకంగా ఉంది

ప్రస్తుతం జామాయిల్ ధరలు మార్కెట్‌లో ఆశాజనకంగా ఉన్నాయి. జిల్లా పరిసర ప్రాంతాల్లో పేపర్ తయారీ కంపెనీలు అందుబాటులోకి రావడంతో కర్రకు డిమాండ్ వచ్చింది. టన్ను కర్రను రూ.4,200 నుంచి రూ.4,700లకు కొనుగోలు చేస్తున్నాయి. భవిష్యత్‌లో కర్రకు మరింత డిమాండ్ వచ్చే అవకాశం ఉంది.

– శ్రీనివాసులు, ఏఎంసీ కార్యదర్శి, కందుకూరు

కందుకూరు: గత నాలుగైదేళ్లలో జామాయిల్ కర్రకు ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. టన్ను ధర కేవలం రూ.1,800 నుంచి రూ.2 వేల వరకు మాత్రమే పలికింది. ఈ నేపథ్యంలో రైతులు జామాయిల్ సాగును దాదాపుగా తగ్గించేశారు. దీంతో ప్రస్తుతం జామాయిల్ కర్రకు ఒక్కసారిగా విపరీతమైన డిమాండ్ వచ్చింది. జిల్లా నుంచి రోజుకు 7,500 టన్నుల కర్ర పేపర్ కంపెనీలకు అవసరమవుతోందని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే జిల్లా నుంచి ప్రస్తుతం కేవలం 2,500 టన్నుల ఉత్పత్తి మాత్రమే ఉందని చెబుతున్నారు. దీంతో ఇటీవల పేపర్ తయారీ కంపెనీలు పోటీ పడి జామాయిల్ కర్రను కొనుగోలు చేస్తున్నాయి.

ఎంఎస్‌పీని మించి ధరలు

ప్రభుత్వం టన్ను జామాయిల్ కర్రకు రూ.4,400లను మద్దతు ధరగా ప్రకటించింది. అయితే దీనిలో కర్ర కటింగ్‌తోపాటు, తాటతీసే ఖర్చును కూడా రైతులే భరించాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం కంపెనీలు కటింగ్, తాటతీసే ఖర్చుతో సంబంధం లేకుండా నేరుగా రైతుకు కర్ర సైజును బట్టి టన్నుకు రూ.4,200 నుంచి రూ.4,700 వరకు ధర చెల్లిస్తున్నాయి. గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదు. గత ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకున్నా జామాయిల్ కర్రకు ఇంత ధర ఇచ్చిన దాఖలాలు లేవు. కంపెనీల డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి లేకపోవడంతో భవిష్యత్‌లో రేట్లు ఇంకా పెరిగే అవకాశం ఉందని, రైతులు దళారుల మాయలో పడకుండా జాగ్రత్త పడితే ధరలు పెరుగుతాయని అధికారులు, వ్యాపార వర్గాలు సూచిస్తున్నాయి.

ఈ క్రమంలో ఒక్కసారిగా రేట్లు కూడా పెరిగాయి.

అటవీశాఖ నుంచి 6 లక్షల టన్నుల కొనుగోలు

జిల్లాలో అటవీశాఖ పరిధిలో సాగులో ఉన్న జామాయిల్ కర్రకు ఇటీవల వేలం నిర్వహించారు. ఈ వేలంలో దాదాపు 10 కార్పొరేట్ పేపర్ కంపెనీలు పాల్గొని కర్రను కొనుగోలు చేశాయి. అటవీశాఖ పరిధిలోని 4.50 లక్షల టన్నుల కర్రను టన్ను ఏకంగా రూ.6 వేల వరకు వెచ్చించి కొనుగోలు చేశాయి. అటవీశాఖ పరిధిలో ఉన్న కర్ర దాదాపు 5 నుంచి 7 సంవత్సరాల వయస్సు కలిగినది కావడం, కర్ర సైజు ఆశించిన రీతిలో ఉండడంతో కంపెనీలు ఇంత భారీ రేటును పెట్టి కొనుగోలు చేశాయని తెలుస్తోంది. అలాగే వన సంరక్షణ సమితుల ఆధ్వర్యంలో సాగులో ఉన్న 1.50 లక్షల టన్నుల కర్రను కూడా కొనుగోలు చేశాయి. అయితే ఇవి ధరలు పెరగక ముందే వేలం నిర్వహించడంతో టన్నుకు రూ.3,200 మాత్రమే కంపెనీలు చెల్లించినట్లు సమాచారం. ప్రస్తుతం జిల్లాలోని రైతుల వద్ద మరో లక్ష టన్నుల వరకు జామాయిల్ కర్ర అందుబాటులో ఉన్నట్లు తెలుస్తోంది. కానీ సాగు అంతగా లేకపోవడంతో 2024–25 సంవత్సరంలో కర్ర దొరికే పరిస్థితి లేదని, తిరిగి 2025–26 ఏడాది నుంచి కర్ర అందుబాటులోకి వస్తుందని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కంపెనీలు ముందు జాగ్రత్తగా బఫర్ స్టాక్ కింద కొనుగోలు చేసి భారీగా డంపింగ్ చేస్తున్నాయి. జిల్లాలో కందుకూరు సమీపంలోని పలుకూరు వద్ద, ఏఎస్‌పేట మండలం హసనాపురం వద్ద ఐటీసీ కంపెనీ భారీగా కర్ర డంపింగ్ స్టాక్ పాయింట్‌లు ఏర్పాటు చేసింది. మిగిలిన కంపెనీలు ఇదే బాటలో ఉన్నాయి.

విస్తృతంగా సాగు

ప్రస్తుతం జామాయిల్ మార్కెట్ ఆశాజనకంగా ఉండడంతో రైతులు మరోసారి విస్తృతంగా సాగు చేపడుతున్నారు. దీంతో ఒక్కసారిగా జామాయిల్ మొక్క ధరలు రెట్టింపయ్యాయి. గతంలో రూ.3 ఉన్న మొక్క ప్రస్తుతం రూ.6 పలుకుతోంది. అంత రేటు పెట్టినా ప్రస్తుతం మొక్కలు దొరకడం లేదు. జిల్లాకు అధికంగా తెలంగాణలోని సారపాక నుంచి మొక్కలు సరఫరా అవుతాయి. ఒక్కసారిగా వచ్చిన డిమాండ్‌తో అక్కడి వ్యాపారులు కూడా బ్లాక్ చేసి మొక్కలకు అధిక డిమాండ్ సృష్టిస్తున్నారు. దీంతో రైతులు మొక్కల కోసం దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.

డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

- జిల్లాకు డీఆర్వోగా ఎస్.లవన్న



డీఆర్వోగా నియమితులైన లవన్న

నెల్లూరు(దర్గామిట్ట): సాధారణ బదిలీల్లో భాగంగా డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు డీఆర్వోగా గుంతకల్ ఆర్డీఓ ఎస్.లవన్న నియమితులయ్యారు. ఇక్కడ డీఆర్వోగా పనిచేస్తున్న వెంకటనారాయణమ్మ అనంతపురం టూరిజం ఆర్‌జేడీగా నియమితులయ్యారు. అలాగే రామాయపట్నం భూసేకరణ విభాగం డిప్యూటీ కలెక్టర్‌గా గతంలో విధులు నిర్వహించిన టి.పద్మావతిని తిరిగి నియమించారు. మాతంగి రాజా రమేష్ ప్రేమ్‌కుమార్‌ను ఆత్మకూరులో తెలుగు గంగ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు. అక్కడి డిప్యూటీ కలెక్టర్ జి.సువర్ణమ్మ వెలిగొండ ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పీఏగా నియమితులయ్యారు. రాజమహేంద్రవరం ఓఎన్‌జీసీ భూసేకరణ విభాగం డిప్యూటీ కలెక్టర్‌గా నెల్లూరులో పౌరసరఫరాలశాఖ విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ ఎం.సుధాకర్‌ను బదిలీ చేశారు. ఆత్మకూరు ఆర్డీఓగా విధులు నిర్వహిస్తూ బదిలీ అయిన ఎస్.కరుణకుమారిని యువత అభివృద్ధి, పర్యాటక విభాగం అనంతపురం సీఈఓగా నియమించారు.

డీఏ ప్రకటించడంపై హర్షం

నెల్లూరు(టౌన్): ప్రభుత్వ ఉద్యోగులకు దసరా కానుకగా 3.64 శాతం డీఏ మంజూరు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు ఇవ్వడంపై వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారాయణరాజు, మునీర్‌జాన్ ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. డీఏ ప్రకటించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన



లబ్ధిదారుకు ఇంటి స్థలం పట్టా అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: రాష్ట్రంలో పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చెముడుగుంట పంచాయతీ నక్కలకాలనీలో ఆదివారం అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలను మంత్రి కాకాణి చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో పేదలు ఇళ్ల స్థలాలు, సొంతింటి కల నెరవేర్చుకునేందుకు కాళ్లరిగేలా తిరిగినా ఎవరూ పట్టించుకున్న దాఖలాల్లేవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, పేదలకు సొంతింటి కలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారని తెలిపారు. అందులో భాగంగానే జగనన్న కాలనీల పేరుతో లేఅవుట్లు ఏర్పాటు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలంతోపాటు ఇల్లు నిర్మిస్తుంటే ప్రతిపక్ష నేత చంద్రబాబు ఓర్వలేక కోర్టులకు వెళ్లి ఇళ్ల పట్టాల పంపిణీని అడ్డుకునే కుట్రలు చేశారని తెలిపారు. గతంలో మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఐదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్రలో ప్రజలకిచ్చిన ప్రతి హామీని నెరవేర్చి వారి అభిమానాన్ని పొందారని తెలిపారు. నక్కలకాలనీలో ప్రస్తుతం 172 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామని, రాబోయే రోజుల్లో మరో 200 మందికి పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు రూ.10 లక్షలతో రామాలయం నిర్మాణాన్ని చేపడతామన్నారు. అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. వచ్చే ఏడాది జనవరి నెల నుంచి పింఛన్ నగదును రూ.3 వేలకు పెంచి అందజేస్తామని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ మధు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, సర్పంచ్ రాములమ్మ, ఎంపీటీసీ సభ్యుడు ఏడుకొండలు, నాయకులు రాచాల రవికుమార్ యాదవ్, కప్పిర సూరియాదవ్, కుంచె రమేష్ యాదవ్, సుందరరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సాయిబాబా ఆరాధన మహోత్సవాలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పద్మావతినగర్‌లో ఉన్న సాయిదర్బార్ అద్దాల మందిరంలో సోమవారం నుంచి 25వ తేదీ వరకు సాయిబాబా 105వ మహాసమాధి (ఆరాధన) మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆ మందిర కమిటీ చైర్మన్ మధుసాయి ఆదివారం తెలిపారు. షిర్డీ సంప్రదాయంగా 36 మంది సాయిభక్తుల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నుంచి పద్మావతినగర్, ఏసీనగర్, బాలాజీనగర్ పురవీధుల్లో సాయి భిక్షాటన నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి కాకడ హారతి, సాయినాథుడికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 'ఓంసాయి శ్రీసాయి జయజయ సాయి' అఖండ సాయినామ సంకీర్తన జరుగుతుందన్నారు.

ఉదయగిరి రేంజ్‌లో రెడ్ అలర్ట్



మాట్లాడుతున్న రేంజ్ అధికారి ఉమామహేశ్వరరెడ్డి

ఉదయగిరి: అటవీశాఖ ఉదయగిరి రేంజ్ పరిధిలో వన్యప్రాణుల సంరక్షణపై ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు, వింజమూరు మండలాల్లోని రిజర్వు ఫారెస్ట్ ప్రాంతాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించినట్లు రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రిజర్వు ఫారెస్ట్ ప్రాంతాల్లో జింకలు, దుప్పులు, కణితులు తదితర అటవీ జంతువులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అడవి జంతువులు తాగునీటి కోసం గ్రామాల్లోకి వస్తే వాటికి ఎలాంటి హాని తలపెట్టకుండా సమాచారం అటవీ అధికారులకు ఇవ్వాలన్నారు. అడవి జంతువుల మాంసాన్ని కొనుగోలు చేసినా, వంటకు ఉపయోగించినా వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అడవి జంతువులను వేటాడేందుకు వలలు వేయడం, కరెంట్ పెట్టడం వంటివి చేయడం నేరమన్నారు. ఏదైనా సమాచారం ఉంటే ప్రజలు టోల్‌ఫ్రీ నంబరు 1800 495 5909కు తెలియజేయాలన్నారు. రేంజ్ పరిధిలో రెండు బృందాలతో గస్తీని ముమ్మరం చేస్తున్నామన్నారు. వన్యప్రాణులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు.

కండలేరులో 11.508 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 11.508 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 40, పిన్నేరు వాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిస్‌కు 30 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధిని ప్రజలకు వివరిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు(సెంట్రల్): అన్నివర్గాల ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేస్తున్న అభివృద్ధిని క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియజేద్దామని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. నెల్లూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో 'జగనన్నకు చెబుదాం' నెల్లూరు రూరల్ మండల సమీక్ష సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అలాగే గ్రామస్థాయిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనకు తేడాను ప్రజలకు వివరించి, మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిగా చేసుకుందామని ప్రజలకు తెలియజేయాలన్నారు. అందరం కలసికట్టుగా పనిచేసి రానున్న ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేతలు ఆనం విజయకుమార్‌రెడ్డి, చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బూడిద విజయకుమార్, మొయిళ్ల గౌరి, మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి, మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డి, పుచ్చలపల్లి రాంప్రసాద్ రెడ్డి, పాలకీర్తి రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ నృత్య దినోత్సవం



నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో ప్రపంచ నృత్య దినోత్సవాన్ని పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మేయర్ స్రవంతి మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కళల్లో ప్రోత్సహించాలని కోరారు. అనంతరం నాట్యాచార్యుడు డేగల సాంబశివరావును విశిష్ట కళారత్న, స్వచ్ఛంద సేవకుడు షబ్బీర్‌ను విశిష్ట సేవారత్నతో సత్కరించారు. జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్, అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.65
సన్నవి	రూ.25
పండ్లు	రూ.7

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	రూ.112
లేయర్	రూ.110
బ్రాయిలర్ చికెన్	రూ.200
స్కిన్‌లెస్ చికెన్	రూ.220
లేయర్ చికెన్	రూ.187

పెన్‌కాక్ సిలాట్‌కు సలామ్

- యుద్ధకళలో రాణిస్తున్న క్రీడాకారులు
- పతకాలు సాధించిన జిల్లా విద్యార్థినులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): యుద్ధ క్రీడ పెన్‌కాక్ సిలాట్‌పై మక్కువ చూపుతున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. కొద్దిపాటి సమయాన్ని కేటాయించి సాధన చేస్తే క్రీడలో అద్భుతంగా రాణించొచ్చని క్రీడాకారులు నిరూపించారు. చదువులకు ఎక్కువ సమయాన్ని కేటాయిస్తూ క్రీడల్లో ఆసక్తి ఉన్న వారికి పెన్‌కాక్ సిలాట్ న్యూ ట్రెండ్‌గా మారింది.

ఇంజినీరింగ్ చదువుతూ క్రీడల్లో పతకాలు

నగరానికి చెందిన విద్యార్థులు ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతూ క్రీడలో రాణించి జాతీయ స్థాయిలో పతకాలను సాధించొచ్చని నిరూపించారు. చిన్నతనం నుంచే ఆటలపై ఉన్న ఆసక్తితో ముగ్గురు ఇంజినీరింగ్ విద్యార్థులు ఖేలో ఇండియా జాతీయ స్థాయిలో స్వర్ణ పతకాలను సాధించారు. మొదటి ప్రయత్నాల్లో రాణించలేకపోయినా, గురువుల శిక్షణ, క్రీడపై వారికి ఉన్న ఆసక్తి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది.



ఖేలో ఇండియా జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన తనూష, హారిక, నిఖిల

రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి



పెన్‌కాక్ సిలాట్‌ను నేర్చుకునే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. సాధనకు తక్కువ సమయాన్ని కేటాయించడం ద్వారా ఎక్కువ మంది నేర్చుకుంటున్నారు. ఇది ఇండోనేసియా జాతీయ క్రీడ. అయినా ఆసియాలో దినదినాభివృద్ధి చెందుతోంది. అనతికాలంలోనే రాష్ట్ర క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు తీసుకొచ్చారు.

– విజయ్‌భరద్వాజరెడ్డి, పెన్‌కాక్ సిలాట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి

ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం



ప్రతిభ ఉండి ఆటలకు దూరమయ్యే క్రీడాకారులను ప్రోత్సహించి వారిలోని నైపుణ్యాన్ని వెలికి తీయడమే లక్ష్యం. వీరికి ఉచితంగా శిక్షణ ఇస్తున్నా. 2016లో ఆసియా బీచ్ గేమ్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని కాంస్య పతకాన్ని సాధించా. ప్రస్తుత పరిస్థితుల్లో పెన్‌కాక్ సిలాట్‌లో రాణించేందుకు అవకాశాలు ఎక్కువ.

– మనోజ్‌సాయి, కోచ్

ఓటములను లెక్క చేయలేదు



పెన్‌కాక్ సిలాట్ అనే యుద్ధకళను ఫిజికల్ డైరెక్టర్ ప్రసాద్ ద్వారా తెలుసుకున్నా. పంజాబ్‌లో నిర్వహించిన యూనివర్సిటీ గేమ్స్‌లో పాల్గొని ఓటమిపాలయ్యా. పుత్తూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని రేగు విభాగంలో స్వర్ణ, టర్నింగ్‌లో రజత పతకాలను సాధించా. తిరుపతిలో నిర్వహించిన ఖేలో ఇండియా ఉమెన్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచా. రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధిస్తా.

– నిఖిల, ఇంజినీరింగ్ విద్యార్థి

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించొచ్చు



చిన్నతనం నుంచి క్రీడలంటే చాలా ఇష్టం. పాఠశాల స్థాయిలో ఖోఖో, కబడ్డీ పోటీల్లో జిల్లా స్థాయిలో పాల్గొన్నా. బీటెక్‌లో మా సీనియర్ మల్లికార్జున ద్వారా పెన్‌కాక్ సిలాట్‌ను తెలుసుకొని నేర్చుకున్నా. కోచింగ్ పొంది జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నా. అక్కడ రాణించలేకపోయినా, మరింత సాధన చేసి తిరుపతిలో నిర్వహించిన ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్‌లో రేగు కేటగిరీలో స్వర్ణ పతకాన్ని సాధించా.

– తనూష, ఇంజినీరింగ్ విద్యార్థి

చిన్నతనం నుంచే క్రీడలంటే ఇష్టం



క్రీడా పోటీలంటే చిన్నతనం నుంచే చాలా ఇష్టం. ఇంజినీరింగ్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ ప్రసాద్ ద్వారా పెన్‌కాక్ సిలాట్ యుద్ధకళ పరిచయమైంది. సీనియర్ సాయంతో నేర్చుకోవడం ప్రారంభించాను. మహారాష్ట్రలో నిర్వహించిన సీనియర్స్ నేషనల్ పెన్‌కాక్ సిలాట్‌లో పాల్గొన్నా విఫలమయ్యా. అనంతరం తిరుపతిలో నిర్వహించిన ఖేలో ఇండియా మహిళల విభాగంలో పాల్గొని ట్యాండింగ్‌లో ఐదు మ్యాచ్‌లు, రేగు కేటగిరీలో స్వర్ణ పతకాన్ని సాధించా.

– హారిక, ఇంజినీరింగ్ విద్యార్థి

సర్వేపల్లిలో టీడీపీ భూస్థాపితం



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ భూస్థాపితమైందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చెముడుగుంటలో టీడీపీ నేత కుంకాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో 100 కుటుంబాలు మంత్రి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేరారు. వీరికి కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించిన అనంతరం ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్వేపల్లి నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులను చేపట్టామని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందించామని వివరించారు. గ్రామంలో ఎక్కడా మట్టి రోడ్లు లేకుండా సిమెంట్ రోడ్లు, సైడ్‌కాలువలు, తాగునీటి పథకాలు.. ఇలా ఎన్నో అభివృద్ధి పనులను చేపట్టామని వెల్లడించారు. దీంతో టీడీపీలో ఏళ్లుగా ఉన్న నేతలు సైతం తమ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని చెప్పారు. చెముడుగుంటలోని టీడీపీ నేతలంతా తమ పార్టీలో చేరుతున్నారన్నారు.

20 మేకల మృతి



వెంకటాచలం: అడవిలో 20 మేకలు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. బాధితుడు, కసుమూరు గ్రామానికి చెందిన తిరుమలశెట్టి జ్ఞానయ్య వివరాల మేరకు.. మేకలను సమీపంలోని అడవికి మేపుకొనేందుకు తరలించారు. ఈ క్రమంలో అడవిలోని గుంతల్లో నీరు తాగి ఒక్కసారిగా మేకలు కుప్పకూలి మృత్యువాతపడ్డాయి. జింకల కోసం గుంతల్లో గుర్తుతెలియని వ్యక్తులు విష పదార్థాలు కలపడంతో మేకలు మృతి చెంది ఉండొచ్చని పేర్కొన్నారు. మేకల విలువ రూ.80 వేలకుపైగా ఉంటుందని తెలిపారు.

కొలువు వల.. కన్నీరే ఆవల

- నిరుద్యోగులే లక్ష్యంగా మోసాలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీస్ అధికారులు

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తి డిజిటల్ అసిస్టెంట్ పోస్టులు ఇప్పిస్తామంటూ సీతారామపురం మండలానికి చెందిన నిరుద్యోగులను నమ్మించాడు. ఒక్కొక్కరి నుంచి రూ.లక్షల్లో నగదు వసూలు చేసి మోసగించాడు. మోసపోయిన బాధితులు స్పందనలో పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే హోంగార్డ్స్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మరో వ్యక్తి పలువుర్ని మోసగించాడు. బాధితులు విషయాన్ని పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే మరో వ్యక్తి బ్యాంక్‌లో ఉద్యోగం ఇప్పిస్తామంటూ నిరుద్యోగులకు వల విసిరాడు. వారిని నమ్మించేందుకు ఇంటర్వ్యూలు సైతం నిర్వహించి ఒక్కో పోస్టుకు రూ.1.8 లక్షలు వసూలు చేశాడు. నియామక పత్రాలను అందజేస్తానని చెప్పి కార్యాలయానికి తాళం వేసి పలాయనం చిత్తగించాడు. దీంతో బాధితులు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించారు. అదే విధంగా రైల్వేలో టీటీఈ, టీసీ పోస్టులు ఇప్పిస్తామని ఇద్దరు వ్యక్తుల వద్ద రూ.రెండు లక్షల చొప్పున కొందరు వసూలు చేసి మోసగించారు. దీంతో బాధితులు స్పందన కార్యక్రమంలో ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

పోస్టాఫీస్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని పోస్టల్ ఉద్యోగి పలువురు నిరుద్యోగుల నుంచి నగదు వసూలు చేశాడు. ఉద్యోగం ఇప్పించకపోవడంతో బాధితులు స్పందనలో పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఇటీవలి కాలంలో ఈ తరహా మోసాలు అధికమవుతున్నాయి.

కొందరు కొలువుల వల విసురుతూ నిరుద్యోగులు, వారి తల్లిదండ్రులే లక్ష్యంగా రూ.లక్షలను దోచేస్తున్నారు. ప్రభుత్వోద్యోగం వస్తే జీవితంలో స్థిరపడినట్లేనని, వెనక్కి చూసుకోవాల్సిన అవసరమే లేదని, ఖర్చుకు వెనుకాడకపోతే కేంద్ర ప్రభుత్వ సంస్థల్లోనూ ఉద్యోగాలిప్పిస్తామంటూ ఆశ చూపుతూ ఉచ్చులోకి దింపుతున్నారు. రూ.లక్షల్లో నగదు వసూలు చేసి కొందరు పలాయనం చిత్తగిస్తుండగా, మరికొందరు తమకున్న పలుకుబడితో బాధితులపై బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారు. నిరుద్యోగులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని అధికారులు చెప్తున్నా, జిల్లాలో అలా మోసపోయి రూ.లక్షల్లో నగదు పోగొట్టుకున్న వారు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. ఇందులో పది శాతం మంది కూడా పోలీసులకు ఫిర్యాదులు చేసేందుకు ముందుకురావడం లేదు. డబ్బులు పోతేపోయాయి.. పరువు సైతం పోతుందని, ఉన్నత చదువులు అభ్యసించి సైతం మోసపోయారంటారని పోలీసులకు ఫిర్యాదు చేయడానికి కొందరు ముందుకు లేదు. ఏడాదికి వందలాది మంది నిరుద్యోగులు మోసపోతున్నా, నమోదయ్యే పదుల సంఖ్యలో కూడా ఉండటం లేదు. బాధితుల్లో అధిక శాతం మంది బీటెక్, ఎంటెక్, ఎంబీఏ తదితర కోర్సులు చేసిన వారే ఉండటం గమనార్హం.

జాగ్రత్త అవసరం

ఏ ప్రభుత్వోద్యోగాన్ని డబ్బులు కట్టించుకుని ఇవ్వరనే విషయాన్ని నిరుద్యోగులు గమనించాలి. ఇచ్చిన ఉద్యోగ ప్రకటన వెబ్‌సైట్ సరైందో కాదో క్షుణ్ణంగా పరిశీలించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ అందులో ఉన్న మొబైల్ నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోరాదు. ఒకసారి ఆ సంస్థ ప్రధాన కార్యాలయం లేదా శాఖ కార్యాలయానికి వెళ్లి నిర్ధారించుకోవాలి.

అప్రమత్తంగా ఉండాలి



ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగాలిప్పిస్తామని మోసగించే వ్యక్తులతో నిరుద్యోగులు అప్రమత్తంగా ఉండాలి. ఏ ప్రభుత్వోద్యోగాన్ని డబ్బులు కట్టించుకొని ఇవ్వరనే విషయాన్ని గమనించాలి. ఎవరైనా డబ్బులు కడితే ఉద్యోగం వస్తుందని చెప్తే మోసగిస్తున్నారని గ్రహించాలి. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. ఉద్యోగాల పేరిట మోసగించే వ్యక్తులపై కఠిన చర్యలు చేపడతాం.

– తిరుమలేశ్వరరెడ్డి, ఎస్పీ

క్రమశిక్షణతో కూడిన జీవితం అవసరం



విడవలూరు: క్రమశిక్షణతో కూడిన జీవితం అవసరమని ఆరెస్సెస్ ముఖ్యవక్త, విభాగ ప్రచారక్ రాళ్లబండి నవీన్ పేర్కొన్నారు. మండలంలోని రామతీర్థంలో గల ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఆరెస్సెస్ ప్రాథమిక శిక్ష వర్గ ముగింపు ఉత్సవంలో ఆయన మాట్లాడారు. క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చని చెప్పారు. వారం పాటు నిర్వహించిన కార్యక్రమంలో వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. నేతలు శ్రీనివాసులు, రమణయ్య, వెంకటేశ్వర్లు, కరుణాకర్, నరేంద్ర, రమేష్, వెంకటకుమార్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సాక్షి **ప్రాఫిట్ ప్లస్**
సోమవారం
23-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	232	65,398
నిఫ్టీ ▽	82	19,543

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)		
నాస్‌డాక్	12,984	▽ 202
డోజోన్స్	33,127	▽ 287
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,402	▽ 97
డాక్స్	14,798	▽ 247
సాంఘై	2,983	▽ 22
నికాయ్	31,259	▽ 171

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎన్‌ఈం	82.43	84.10
£	బ్రిటన్ పౌండ్	ఎన్‌ఈం	99.44	102.75
€	యూరో	ఎన్‌ఈం	86.54	89.63
¥	జపాన్ ఎన్ (100)	ఎన్‌ఈం	54.73	56.44
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎన్‌ఈం	51.55	53.84
S$	సింగపూర్ డాలర్	ఎన్‌ఈం	59.70	61.63
SAR	సౌదీ రియాల్	[illegible]	21.21	22.83
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.73	23.53
¥	చైనా యువాన్	[illegible]	10.24	12.31

పాత బంగారం మార్చుకుంటున్నారా?

పండుగలు అంటే కేవలం ఖర్చు చేయడమే కాదు.. భవిష్యత్తు 'బంగారు'బాట వేసుకోవడం కూడా. నచ్చిన గృహోపకరణాలు, గ్యాడ్జెట్లు కొనే వారు, అందులో కొంత ఆదా చేసి భవిష్యత్ కోసం ఎందుకు ఇన్వెస్ట్ చేసుకోకూడదు? ఇలా ఆలోచించే కొందరు పండుగ సమయాల్లో బంగారం కొనుగోలు చేస్తుంటారు. బంగారం కేవలం అందాన్ని పెంచే ఆభరణం మాత్రమే కాదు, విలువను పెంచే ఆస్తి. అస్థిరతల్లో ర్యాలీ చేసే పెట్టుబడి సాధనం. కనుక పండుగ సమయాల్లో విలువ తరిగిపోయే వాటి కోసం వేలాది రూపాయలు ఖర్చు పెట్టేవారు.. పసిడికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నది నిపుణుల సూచన.



- ఆభరణం కోసమా.. పెట్టుబడి కోసమా?
- రెండింటికీ ఒక్కటే విధానం అనుకూలం కాదు
- అవసరమైతేనే కొత్త ఆభరణంతో మార్పిడి
- ఈ సమయంలో తయారీ, పన్నుల రూపంలో నష్టం
- పెట్టుబడి దృష్ట్యా మెరుగైన ప్రత్యామ్నాయాలు

గడిచిన కొన్నేళ్లలో బంగారం కొనుగోలు ఎన్నో మార్పులను సంతరించుకుంది. 20 ఏళ్ల క్రితం బంగారంపై పెట్టుబడి పెట్టే వారు అరుదుగా కనిపించేవారు. తర్వాత కాలంలో ఇందులో స్పష్టమైన మార్పు కనిపించింది. ముఖ్యంగా గడిచిన పదేళ్ల కాలంలో బంగారాన్ని పెట్టుబడి సాధనంగా అర్థం చేసుకోవడం పెరిగింది. గతంలో బంగారంపై పెట్టుబడి అంతా భౌతిక రూపంలోనే ఉండేది. ఇప్పుడు సార్వభౌమ పసిడి బాండ్లు (ఎస్‌జీబీలు), గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్, గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (గోల్డ్ ఈటీఎఫ్‌లు) సాధనాలు అందుబాటులో ఉన్నాయి. అయినా, ఇప్పటికీ పెట్టుబడి దృష్ట్యా భౌతిక బంగారానికే ఎక్కువ మంది ప్రాధాన్యం ఇస్తున్నారు. ధంతేరస్ (ధనత్రయోదశి) వంటి ప్రత్యేక పర్వదినాల్లో పెద్ద ఎత్తున బంగారం కొనుగోళ్లు నమోదవుతుంటాయి. ఒక తరం నుంచి మరో తరానికి బదిలీ అయ్యే ఆస్తుల్లో బంగారానికి మొదటి స్థానం ఉంటుంది. నేటితరం పాత బంగారాన్ని, కొత్త ఆభరణాలతో మార్చుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. నిజానికి పాత బంగారం మార్పిడితో కొత్త ఆభరణాలు కొనుగోలు చేయడం సరైనదా..? ఆభరణాలను పెట్టుబడిగా చూడొచ్చా? పెట్టుబడి కోసం ఏ రూపంలో ఇన్వెస్ట్ చేయడం మెరుగు? ఈ విషయంలో నిపుణుల అభిప్రాయాలను ఎలా ఉన్నాయో పరిశీలిద్దాం.

బంగారం మార్పిడి విధానం..?

పాత బంగారు ఆభరణాలను మార్చుకోవడం వెనుక ఎన్నో కారణాలు ఉండొచ్చు. మార్కెట్లోకి వచ్చే కొత్త డిజైన్ల పట్ల ఆసక్తి ఏర్పడొచ్చు. పాత నగలు డ్యామేజ్ కావొచ్చు. లేదంటే కొత్త ఆభరణాలు కొనుగోలు చేసుకోవడానికి బడ్జెట్ లేక పాత వాటిని మార్చుకోవచ్చు. కారణం ఏదైనా.. పాత బంగారం మార్చుకునే క్రమంలో కొంత నష్టపోతున్నామనే విషయాన్ని అర్థం చేసుకోవాలి. పాత బంగారం ఆభరణాల మార్పిడికి సంబంధించి మన దేశంలో ప్రామాణిక విధానం అంటూ లేదు. వర్తకుల మధ్య వ్యత్యాసం కనిపిస్తుంది. ఆభరణం కొనుగోలు చేసిన వర్తకుడి వద్దే దాన్ని మార్చుకోవడం వల్ల గరిష్ట విలువను తిరిగి పొందడానికి అవకాశం ఉంటుంది. హాల్‌మార్క్ ఆభరణాలు అయితే బంగారం మార్కెట్ ధర మేర విలువను పొందొచ్చు. అయినా కానీ, ఆభరణాల తరుగు–తయారీ చార్జీలు అధికంగా ఉంటున్నాయి. బంగారం ధరలో 10–20 శాతం వరకు తరుగు, తయారీ చార్జీలను జ్యుయలరీ సంస్థలు వసూలు చేస్తున్నాయి. పాత ఆభరణాన్ని మార్చుకున్నప్పుడు అందులో తరుగు–తయారీ రూపంలో కొంత నష్టం ఏర్పడుతుంది. తిరిగి నూతన ఆభరణం కొనుగోలు చేయడం వల్ల, దాని తరుగు–తయారీ చార్జీల రూపంలో అదనంగా చెల్లించుకోవాల్సి వస్తుంది.

కొనుగోలు చేసిన వర్తకుడి నుంచి కాకుండా, వేరొక చోట పాత ఆభరణాన్ని మార్చుకునేట్టు అయితే ప్రక్రియ వేరుగా ఉంటుంది. వర్తకులు కొందరు కొన్ని అంశాల్లో ఏకరూప విధానాన్ని అనుసరిస్తుంటే, కొన్నింటి విషయాల్లో సొంత ప్రక్రియలను అమలు చేస్తున్నారు. పాత బంగారం ఆభరణాన్ని కరిగించి, స్వచ్ఛత చూసిన తర్వాత, కొత్త ఆభరణంతో మార్చుకోవడానికి చాలా సంస్థలు అనుమతిస్తున్నాయి. ''డిజిటల్ స్కేల్ సాయంతో బంగారం ఆభరణం బరువు చూస్తారు. దీని ఆధారంగా స్వచ్ఛతను బట్టి ధర నిర్ణయిస్తారు. సాధారణంగా అనుసరించే స్వచ్ఛతలు 24 క్యారట్ (99.9 శాతం స్వచ్ఛత), 22 క్యారట్ (91.6 శాతం స్వచ్ఛత), 18 క్యారట్ (75 శాతం స్వచ్ఛత). కొందరు జ్యుయలర్లు స్క్రాచ్ (గీయడం), యాసిడ్ టెస్ట్ ద్వారా బంగారం స్వచ్ఛతను నిర్ధారిస్తుంటారు''అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కమోడిటీస్ హెడ్ హరీశ్.వి తెలిపారు. అన్నింటికంటే ప్రామాణికమైనది హాల్‌మార్క్ స్వచ్ఛత విధానం. భారతీయ ప్రమాణాల మండలి (బీఐఎస్) హాల్‌మార్క్ సర్టిఫికేషన్ సేవలు అందిస్తోందని, హాల్‌మార్క్ గోల్డ్ స్వచ్ఛత పరంగా విశ్వసనీయమైనదిగా హరీశ్ పేర్కొన్నారు. ఇప్పుడు పెద్ద సంస్థలు అయితే క్యారట్‌ను కొలిచే మెషీన్లను ఉపయోగిస్తున్నాయి. వీటినే గోల్డ్ అనలైజర్ మెషీన్లు అంటున్నారు. అందులో బంగారం లేదా ఆభరణాన్ని ఉంచితే బరువు ఎంత, ప్యూరిటీ ఎంత అనే వివరాలను ప్రదర్శిస్తాయి. ఉదాహరణకు వడోదరకు చెందిన రీనా దంపతులు ఎదుర్కొన్న అనుభవాన్ని తెలుసుకుంటే పాత బంగారం మార్పిడి ఇప్పుడు ఎంత సులభంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. వీరివద్దనున్న 20 గ్రాముల బంగారం చైన్ తెగిపోగా, 2014లో మార్చుకుందామని అనుకున్నారు. ఓ జ్యుయలర్ వద్దకు వెళితే, కంటితో చూసి 18 క్యారట్ల బంగారం అని ఖరారు చేసి, రూ.37,500 ధర చెల్లిస్తానని చెప్పాడు. అప్పుడు 10 గ్రాముల బంగారం ధర రూ.25,000 స్థాయిలో ఉంది. దీంతో వారు మార్చుకోలేదు. ఇటీవలే అదే చైన్‌ను ఓ వర్తకుడి వద్దకు తీసుకెళ్లగా, గోల్డ్ అనలైజర్ మెషీన్‌లో పెట్టి చూశారు. 22 క్యారెట్ల ప్యూరిటీ ఉన్నట్టు చూపించింది. దాన్ని కరిగించిన తర్వాత అసలు విలువ చెబుతానని అనడంతో, అందుకు రీనా దంపతులు ఒప్పుకున్నారు. కరిగించిన తర్వాత కూడా 22.1 క్యారెట్ నిర్ధారణ అయింది. దాంతో 10 గ్రాములకు రూ.61,000 చొప్పున విలువ కట్టారు. కొత్త ఆభరణం ధర కూడా అదే రీతిలో ఉండడంతో వారు మార్చుకునేందుకు సమ్మతించారు.

కొత్త ఆభరణాల కొనుగోలు

బంగారం కూడా ఒక ఆస్తే. ఎవరి పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోకైనా ఇది విలువను పెంచుతుంది. ఆభరణం కోసం కొంటున్నారా? లేక పెట్టుబడి దృష్ట్యా కొంటున్నారా? అన్న స్పష్టత అవసరం. భౌతిక బంగారం, ఆభరణాల రూపంలో ఇన్వెస్ట్ చేసుకునేట్టు అయితే తరుగు–తయారీ చార్జీలు, దానిపై జీఎస్‌టీ చార్జీలు చెల్లించాల్సి వస్తుంది. స్వచ్ఛతకు సంబంధించిన సమస్యలు కూడా ఉంటాయి. నేడు చాలా జ్యుయలరీ సంస్థలు తమ వద్దే విక్రయిస్తే 100 శాతం విలువను చెల్లిస్తున్నాయి. ఒకవేళ ఆభరణంతో మార్చుకోకుండా, నగదు కోరితే మొత్తం విలువలో 5 శాతం వరకు తగ్గించి ఇస్తున్నాయి. పన్ను కోణంలో ఇలా చేస్తున్నాయి. ''జ్యుయలరీ అనేది సెంటిమెంటల్. మనోభావాలతో ఉంటుంది. ఒక తరం నుంచి ఇంకో తరానికి బదిలీ అవుతుంటుంది. అయితే అధిక తరుగు–తయారీ చార్జీల (10–20 శాతం)తో మార్చుకునేందుకు అయ్యే వ్యయం ఎక్కువ. దీనికితోడు జ్యుయలరీ కోసం స్టోరేజ్, లాకర్ చార్జీలను కూడా చెల్లించుకోవాల్సి రావచ్చు. భౌతిక బంగారం అయినా, ఆభరణాలు అయినా అవి వ్యక్తిగత ఆస్తులు. ఒక ఇన్వెస్టర్ పెట్టుబడుల విలువకు తోడు కావు. పెట్టుబడి కోసం అయితే బంగారం కడ్డీలు లేదా కాయిన్లను కొనుగోలు చేయడం కాస్త మెరుగైనది'' అని సెబీ నమోదిత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ దిల్షద్ బిల్లిమోరియా సూచించారు. అయితే బంగారం కాయిన్లు, కడ్డీలను తిరిగి విక్రయించే సమయంలో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె అంటున్నారు. ''బ్యాంక్‌లు కాయిన్లు, కడ్డీలను విక్రయించడమే కానీ, వెనక్కి తీసుకోవడం లేదు. దీంతో వీటిని బయట విక్రయించుకోవాల్సి వస్తుంది. తరుగు, కరిగించేందుకు చార్జీలను ఆ సమయంలో వసూలు చేస్తున్నారు''అని బిల్లిమోరియా వివరించారు.

ఏమిటి మార్గం..?

ద్రవ్యోల్బణం ప్రభావాన్ని కాచుకునే చక్కని హెడ్జింగ్ సాధనం బంగారం అని నిపుణులు చెబుతున్నారు. బంగారంలో ఇన్వెస్ట్ చేయడం వల్ల ఎవరి పోర్ట్‌ఫోలియోలో అయినా వైవిధ్యం ఏర్పడుతుందని అంటున్నారు. కాకపోతే పెట్టుబడి దృష్ట్యా అయితే ఆభరణాల కంటే మెరుగైన ప్రత్యామ్నాయాలను పరిశీలించాలన్నది నిపుణుల సూచన. గోల్డ్ ఈటీఎఫ్‌లు, ఎస్‌జీబీలు, గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్‌ను ఇందుకు నిదర్శనంగా పేర్కొంటున్నారు. ''చారిత్రకంగా చూస్తే బంగారం ధరలు ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా సగటున ఏటా 5–11% మధ్య వృద్ధి చెందాయి. ద్రవ్యోల్బణం పెరిగే సమయంలో గోల్డ్ చక్కని హెడ్జింగ్ సాధనం. పెట్టుబడుల వైవిధ్యం దృష్ట్యా బంగారం ఒక మంచి పెట్టుబడి సాధనం అవుతుంది. అయితే అది కడ్డీలు లేదా జ్యుయలరీ రూపంలో ఉండకూడదు'' అని బిల్లిమోరీ సూచించారు. పీపీఎఫ్, కార్పొరేట్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు వంటి సాధనాలు బంగారం మాదిరే వైవిధ్యానికి తోడు, మెరుగైన రాబడి, లిక్విడిటీతో ఉంటాయని చెప్పారు. కనుక పాత బంగారం మార్పిడి అనేది అవసరం ఆధారంగానే నిర్ణయించుకోవాలి. ఉపయోగించని ఆభరణాలను మార్చుకుని కొత్తవి తీసుకోవడం మంచి నిర్ణయం అవుతుంది. పెట్టుబడి కోసం అయితే ఆభరణాలకు బదులు నిపుణులు సూచించిన ప్రత్యామ్నాయాలను పరిశీలించడం మేలు. దీని వల్ల బంగారం విలువలో నష్టపోయే అవకాశం ఉండదు. 2010 వరకు బంగారం విలువ 10 గ్రాములు రూ.15,000 స్థాయిలోనే ఉండేది. కనుక పెట్టుబడుల దృష్ట్యా భౌతిక బంగారాన్ని పెద్ద మొత్తంలో కొనుగోలు చేసే వారు. కానీ, నేడు ధర గణనీయంగా పెరిగిపోవడంతో, పెట్టుబడి కోణంలో డిజిటల్ బంగారం సాధనాలకు ప్రాధాన్యం పెరుగుతోంది.

మార్చుకుంటే ఎంత కోల్పోవచ్చు..?

	పాత ఆభరణం	కొత్త ఆభరణం
బరువు	20గ్రాములు	20 గ్రాములు
ధర (10 గ్రా.)	రూ.60,000 (సుమారు)	రూ.60,000
తరుగు–తయారీ చార్జీలు	లేవు	15 శాతం
పన్ను	వర్తించదు	3 శాతం
మొత్తం ధర	1,20,000	1,41,600

మార్చుకోవడం వల్ల కోల్పోయేది రూ.21,600

కొనుగోలు మార్గాలు.. చార్జీలు.. రిస్కులు

సాధనం	కొనుగోలు మార్గం	రిస్క్	చార్జీలు	కనీస పెట్టుబడి
భౌతిక బంగారం	ఆభరణాలు, కాయిన్లు, కడ్డీలు	జాగ్రత్తగా కాపాడుకోవడం	లాకర్, తయారీ, ఇన్సూరెన్స్ వ్యయాలు	ఒక గ్రాము విలువ
డిజిటల్ గోల్డ్	యాప్స్ సాయంతో	నియంత్రణ, పర్యవేక్షణ లేదు	జీఎస్‌టీ పన్ను	రూపాయి నుంచి
గోల్డ్ ఈటీఎఫ్‌లు	షేర్ల మాదిరే, స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల నుంచి	ధరల్లో రోజువారీ హెచ్చుతగ్గులు	ఫండ్ ఎక్స్‌పెన్స్ రేషియో, డీమ్యాట్ ఏఎంసీ చార్జీలు, బ్రోకరేజ్	ఒక గ్రాము నుంచి
గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్	ఏఎంసీల నుంచి, బ్రోకర్ల నుంచి	ఈటీఎఫ్‌ల మాదిరే	0.6–1.20 శాతం	రూ.100 నుంచి
ఎస్‌జీబీలు	ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంక్‌లు, బ్రోకర్ల సాయంతో	దాదాపుగా లేనట్టే	చార్జీల్లేవు, పైగా పెట్టుబడి విలువపై ఏటా 2.5 శాతం రాబడి	రూ.5,000 నుంచి



కొటక్ బ్యాంక్ లాభం అప్

క్యూ2లో రూ. 4,423 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కొటక్ మహీంద్రా బ్యాంక్ ఈ ఏడాది (2023–24) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్ (క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 24% జంప్‌చేసి రూ. 4,423 కోట్లను తాకింది. వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. స్టాండెలోన్ లాభం సైతం రూ. 2,581 కోట్ల నుంచి రూ. 3,191 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం 21% వృద్ధితో రూ. 6,297 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 5.22 శాతాన్ని తాకాయి. ఇతర ఆదాయం రూ. 1,832 కోట్ల నుంచి రూ. 2,314 కోట్లకు పుంజుకుంది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.08% నుంచి రూ. 1.72%కి తగ్గాయి.

అశోక్ వాశ్వానికి సై: కొటక్ మహీంద్రా బ్యాంక్ కొత్త ఎండీ, సీఈవోగా బయటి వ్యక్తి అశోక్ వాస్వాని ఎంపికకు ఆర్‌బీఐ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కొటక్ నాలుగు నెలల ముందుగానే ఎండీ, సీఈవో బాధ్యతల నుంచి వైదొలగుతున్న నేపథ్యంలో అశోక్‌ను బ్యాంక్ బోర్డు ప్రతిపాదించింది.

ఐసీఐసీఐ బ్యాంక్ లాభం జూమ్

క్యూ2లో రూ. 10,896 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ ఈ ఆర్థిక సంవత్సరం (2023–24) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్ (క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 36% జంప్‌చేసి రూ. 10,896 కోట్లను తాకింది. ప్రొవిజన్లు తగ్గడం, వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. స్టాండెలోన్ లాభం సైతం రూ.7,558 కోట్ల నుంచి రూ. 10,261 కోట్లకు ఎగసింది. మొత్తం ఆదాయం రూ. 31,088 కోట్ల నుంచి రూ. 40,697 కోట్లకు దూసుకెళ్లింది. నికర వడ్డీ ఆదాయం 24 శాతం వృద్ధితో రూ. 18,308 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 4.31 శాతం నుంచి 4.53 శాతానికి బలపడ్డాయి. ట్రెజరీ మినహా వడ్డీయేతర ఆదాయం 14 శాతం అధికమై రూ. 5,861 కోట్లయ్యింది.

ఎన్‌పీఏలు డౌన్...

తాజా సమీక్షా కాలంలో ఐసీఐసీఐ బ్యాంక్ స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 3.19 శాతం నుంచి రూ. 2.48 శాతానికి తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 16.07 శాతంగా నమోదైంది.

స్టాక్స్ వ్యూ

రామ్‌కో సిమెంట్స్	షేర్‌ఖాన్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 991 టార్గెట్: రూ. 1,130



ఎందుకంటే: ప్రయివేట్ రంగ కంపెనీ రామ్‌కో సిమెంట్స్ దక్షిణాదిలో సగటు సిమెంట్ ధరల వేగవంత పెరుగుదల, ఈ ఏడాది(2023–24) రెండో త్రైమాసికం (క్యూ2) తదుపరి ఇంధన వ్యయాలు తగ్గడం వంటి అంశాల కారణంగా లబ్ధి పొందే అవకాశముంది. దక్షిణాదిలో సగటు సిమెంట్ ధరలు అక్టోబర్ 5 నుంచి ఒక్కో బ్యాగుకి సుమారు రూ. 40 చొప్పున ఎగశాయి. వెరసి క్యూ2(జులై–సెప్టెంబర్)తో పోలిస్తే సిమెంట్ ధరలు 10 శాతం అధికంగా లభించనున్నాయి. సీజనల్‌గా ఈ ఆర్థిక సంవత్సరం క్యూ2 బలహీన కాలం అయినప్పటికీ బలమైన డిమాండ్ కనిపించింది. ఈ ట్రెండ్ పూర్తి ఏడాదిలోనూ కొనసాగే అంచనాలున్నాయి. పూర్తి ఏడాదికి సిమెంట్ అమ్మకాల పరిమాణంలో 20 శాతం వార్షిక వృద్ధిని కంపెనీ అంచనా వేస్తోంది. ఈ నెలలో అంతర్జాతీయ కోల్, దేశీ పెట్ కోక్ ధరలు నెలవారీగా చూస్తే 13–5 శాతం చొప్పున క్షీణించాయి. మరోవైపు ప్రాంతాలవారీగా సిమెంట్ ధరలు బలపడటంతో నిర్వహణ లాభాలు మరింత పుంజుకునేందుకు వీలుంది. నాన్‌ట్రేడ్ విభాగంపై కంపెనీ ప్రత్యేక దృష్టి సారించడం, అధిక ధరల ఉత్పత్తులు(ప్రీమియమైజేషన్), వ్యయ నిర్వహణా సామర్థ్యాలు, సిమెంటు విక్రయాలలో గరిష్ట ధరలను పొందడం, కొనసాగుతున్న పటిష్ట డిమాండు వంటి అంశాలు కంపెనీ నిర్వహణ లాభం, నికర లాభాలను భారీగా మెరుగుపరిచే అవకాశముంది. దీంతో కంపెనీ ఆర్జనలు పుంజుకోనున్నాయి. ఇది కంపెనీ రీరేటింగ్‌కు దారితీయవచ్చని భావిస్తున్నాం.

హిందాల్కో	మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 473 టార్గెట్: రూ. 570




ఎందుకంటే: అల్యూమినియం తయారీ దిగ్గజం హిందాల్కో ఇండస్ట్రీస్‌కు ఒడిషాలోని హీరాకుడ్, ఆదిత్య ప్లాంట్లను ఇటీవలే సందర్శించాం. తద్వారా ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ మెటల్ తయారీ విధానాలు, కార్యకలాపాలను పరిశీలించాం. ఆదిత్య స్మెల్టర్ ప్లాంటు ప్రపంచంలోనే చౌక వ్యయాల, అత్యంత సమర్థవంతమైన యూనిట్లలో ఒకటిగా నిలుస్తోంది. అత్యంత ఆటోమేటెడ్ విధానంలో ఏర్పాటైన ఈ యూనిట్ కార్యకలాపాల నియంత్రణలో అతిఎక్కువ టెక్నాలజీతోపాటు, క్రేన్లు తదితరాలను వినియోగిస్తోంది. డౌన్‌స్ట్రీమ్‌లో ముడిసరుకులకు సంబంధించి ఫైబర్ రీఇన్‌ఫోర్స్‌డ్ పాలిమర్స్(ఎఫ్ఆర్‌పీ) విస్తరణపై ప్రత్యేక దృష్టిని సారిస్తోంది. తద్వారా లాభదాయకతను మరింత మెరుగుపరచుకునేందుకు వీలుంటుంది. ఇది వ్యయాల ప్రభావిత(ఆదా) సమీకృత విధానంలో భాగంకాగా.. సొంత హాట్ మిల్ సామర్థ్యం ద్వారానే ఎఫ్ఆర్‌పీ ప్రొడక్టులను రూపొందించుకోగలుగుతోంది. అత్యున్నత ఆటోమేషన్, టెక్నాలజీ వినియోగంతోపాటు.. తయారీ విధానంలో ప్రతీ చోటా వ్యయాల ఆదాకు మరింతగా ప్రయత్నిస్తోంది. తయారీలో అత్యంత రక్షణాత్మక చర్యలను అనుసరిస్తోంది. సామర్థ్యాన్ని గరిష్ఠంగా వినియోగించుకునే బాటలో సిమ్యులేషన్ ఆధారిత శిక్షణా విధానాలను అవలంబిస్తోంది. పటిష్ట బ్యాలన్స్‌షీట్ కలిగిన కంపెనీ అంతర్గత వనరుల ద్వారానే విస్తరణ సంబంధ పెట్టుబడి వ్యయాలను సమకూర్చుకుంటోంది. అత్యంత సమీకృత కార్యకలాపాలు కలిగిన కంపెనీ డౌన్‌స్ట్రీమ్ సామర్థ్య విస్తరణ ద్వారా లాభాలను భారీగా పెంచుకునే ప్రణాళికలు అమలు చేస్తోంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

పిల్లల ఉన్నత విద్యకు అనుకూల సాధనాలు?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

మార్కెట్లలో అస్థిరతలను ఇన్వెస్టర్లు అధిగమించడం ఎలా?
– కిరణ్

అస్థిరతలనేవి ఈక్విటీల సహజ లక్షణం. ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా చలిస్తుంటాయి. గడిచిన ఐదు, పదేళ్లుగా మార్కెట్లలో ఇదే ధోరణి కనిపిస్తోంది. ఇన్వెస్టర్లు వీటిని ఎదుర్కోడం ఎలా అన్నది తెలుసుకోవాలి. ఇందుకోసం కొన్ని చర్యలను అమలు చేయాల్సి ఉంటుంది. ముందుగా ప్రతీ ఇన్వెస్టర్ లైఫ్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్లను తీసుకుని తమకు, తమ కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించుకోవాలి. అత్యవసర సందర్భాల్లో ఈక్విటీ పెట్టుబడులను కదిలించకుండా ఉండాలి. ఇందుకోసం ప్రత్యేకంగా అత్యవసర నిధిని (ఈఎఫ్) ఏర్పాటు చేసుకోవాలి. ఈక్విటీల్లో మీ పెట్టుబడులను కనీసం ఐదు నుంచి ఏడేళ్ల పాటు కదపకూడదు. ఈక్విటీ అస్థిరతలను అధిగమించేందుకు ఈ చర్యలు అవసరం. అలాగే, సిప్ వంటి సాధనాల ద్వారా ఇన్వెస్ట్ చేయడం వల్ల మార్కెట్ అస్థిరతల నుంచి ప్రయోజనాన్ని పొందొచ్చు. సిప్ రూపంలో క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేసే వారికి మార్కెట్లలో కరెక్షన్లు మంచి అవకాశాలను తెస్తాయి. ఎందుకంటే ఆ సమయాల్లో ఎక్కువ ఫండ్ యూనిట్లను తక్కువ ధరకే సమకూర్చుకోవచ్చు. మార్కెట్లు దిద్దుబాటుకు గురైతే చౌకగా కొనుగోలు చేయడానికి అవకాశం ఉంటుంది. కానీ, మీడియాలో వచ్చే గందరగోళ సమాచారం ఇన్వెస్టర్లను నిరాశకు, అయోమయానికి, భయానికి గురి చేస్తుంది. దాంతో వారు ప్రతికూల సమయాల్లో పెట్టుబడులు చేయడానికి వెనుకాడుతుంటారు. పైగా కొందరు అమ్మకాలు కూడా చేస్తుంటారు. ఇదే అతిపెద్ద తప్పు. ఆ సమయంలో తప్పకుండా సిప్‌ను కొనసాగించాలి. వీలైతే సిప్ మొత్తాన్ని పెంచుకోవాలి. దీనివల్ల దీర్ఘకాలంలో మరిన్ని రాబడులు సమకూర్చుకోడానికి వీలుంటుంది.

నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారి వయస్సు పదేళ్లలోపే ఉంటుంది. వారి ఉన్నత విద్య కోసం ఏకమొత్తంలో ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. ఇందుకు అనుకూల సాధనాలు ఏవి?
– విజయశ్రీ

పిల్లల విద్య కోసం ఏక మొత్తంలో ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలి?.. చాలా మంది తల్లిదండ్రులు సాధారణంగా ఎదుర్కొనే సందేహం ఇది. ప్రాపర్టీ విక్రయం లేదా బోనస్ లేదా తాతలు తమ మనవళ్లు, మనవరాళ్ల కోసం నగదు బహుమతి ఇచ్చినప్పుడు.. ఆ మొత్తాన్ని పిల్లల భవిష్యత్తు కోసం ఇన్వెస్ట్ చేయాలని చాలా మంది తల్లిదండ్రులు భావిస్తారు. ఇందుకోసం పలు మార్గాలు ఉన్నాయి. సాధారణంగా ఈ మొత్తాన్ని పిల్లల ఉన్నత విద్య కోసం ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటే అందుకు, సాధారణంగా పదేళ్ల కాల వ్యవధి ఉంటుంది. అటువంటప్పుడు ఈక్విటీలకు మించి మెరుగైన సాధనం లేదనే చెప్పాలి. ఈక్విటీల్లోనూ ఫ్లెక్సీక్యాప్ విభాగం అనుకూలంగా ఉంటుంది. ఎందుకంటే ఫ్లెక్సీక్యాప్ పథకాలు పెట్టుబడులను వైవిధ్యం ఉండేలా చూస్తాయి. అన్ని రంగాల పరిధిలో, భిన్న మార్కెట్ క్యాప్ కలిగిన (డైవర్సిఫైడ్) కంపెనీల్లో ఫండ్ మేనేజర్ పెట్టుబడులు పెడతారు.

ఒకవేళ పన్ను ప్రయోజనం కూడా కోరుకుంటే ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్)ను ఎంపిక చేసుకోవచ్చు. ఇవి కూడా ఫ్లెక్సీక్యాప్ మాదిరే పనిచేస్తుంటాయి. అన్ని రంగాలకు చెందిన కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా రిస్క్ తగ్గించే విధంగా ఈఎల్ఎస్ఎస్ పథకాల పనితీరు ఉంటుంది. ఈ పథకాల్లో ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షలు ఇన్వెస్ట్ చేయడం ద్వారా సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనం పొందొచ్చు. ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ పదేళ్ల కాలంలో సగటున 12 శాతానికి పైనే వార్షిక రాబడులు ఇచ్చాయి. ఈ రాబడి రేటు ప్రకారం ఎవరైనా రూ.లక్షను పదేళ్ల కాలానికి ఇన్వెస్ట్ చేస్తే.. రూ.3.14 లక్షలు సమకూరుతుంది. ఈక్విటీల్లో అస్థిరతలు సహజంగా ఉంటాయి. కనుక ఫ్లెక్సీక్యాప్ పథకాల్లోనూ ఇదే కనిపిస్తుంది. అందుకనే ఈక్విటీల్లో ఏక మొత్తంలో ఇన్వెస్ట్ చేయడం కాకుండా, తమ దగ్గరున్న పెట్టుబడులను కొన్ని విడతలుగా ఇన్వెస్ట్ చేసుకోవాలి. మీ దగ్గర ఉన్న ఏక మొత్తాన్ని ఏదైనా డెట్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసి.. దాని నుంచి ప్రతి నెలా సిస్టమ్యాటిక్ ట్రాన్స్‌ఫర్ ప్లాన్ (ఎస్‌టీపీ) రూపంలో ఈక్విటీ పథకాల్లోకి మళ్లించుకోవాలి. మూడేళ్ల కాలంలో దీన్ని పూర్తి చేయాలి. దీనివల్ల మార్కెట్ల ర్యాలీ, కరెక్షన్లలోనూ ఇన్వెస్ట్ చేసినట్టు అవుతుంది.